క్లుప్తంగా

నేడు మంత్రి పర్యటన

కొల్లాపూర్: నియోజకవర్గంలో గురువారం రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పర్యటించనున్నారు. స్థానిక ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డితో కలిసి మధ్యాహ్నం 3 గంటలకు అంకిరావుపల్లిలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చేయనున్నారు. అనంతరం 4 గంటలకు ఎల్లూరులో నూతనంగా ఏర్పాటు చేసిన హెల్త్ సబ్‌సెంటర్‌ను ప్రారంభించనున్నారు. 5 గంటలకు ముక్కిడిగుండం గ్రామ సమీపంలో నూతనంగా నిర్మించబోయే పెద్ద వాగు బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. చివరగా 6 గంటలకు పెంట్లవెల్లికి చేరుకుని అక్కడ నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కంచనున్నారు.

స్వచ్ఛభారత్ మిషన్‌పై అవగాహన



చారకొండ: స్వచ్ఛభారత్ మిషన్ పథకాన్ని గ్రామాల్లో అధికారులు, ప్రజా ప్రతినిధులు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి, సద్వినియోగపరచాలని స్వచ్ఛభారత్ మిషన్ కోఆర్డినేటర్ ఉషన్న అన్నారు. మండలంలోని రైతు వేదికలో బుధవారం స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ ఫేస్– 2 శిక్షణపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఎంపీడీఓ జయసుధ, ఎంపీఓ వెంకటేష్, రాములు పాల్గొన్నారు.

కవులకు సన్మానం



కల్వకుర్తి రూరల్: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా కవి సమ్మేళనం నిర్వహించారు. అంబేడ్కర్ జీవిత చరిత్రపై కవితలు వినిపించారు. ఈ సందర్భంగా 12 మంది కవులను గ్రంథపాలకుడు శంకర్‌జీ శాలువాలతో సత్కరించాడు. జమ్ములు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్ కుటుంబాన్ని ఆదుకోవాలి

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని ఇందిరానగర్ 1వ అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేస్తున్న చెన్నమ్మ అనారోగ్యంతో బుధవారం మృతిచెందింది. చెన్నమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సీడీపీఓకు వినతి అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడారు. 15 సంవత్సరాలుగా చెన్నమ్మ వర్కర్‌గా పనిచేస్తుందని ఆమె కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. జయమ్మ, భారతమ్మ, జయప్రద, గున్నమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

15 నుంచి ఈజీఎస్ సామాజిక తనిఖీలు

ఉప్పునుంతల: మండలంలో ఈ నెల 15వ తేదీ నుంచి జాతీయ ఉపాధిహామీ పనులపై 12వ విడత సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు సామాజిక తనిఖీల రీసోర్స్‌పర్సన్ ప్రభాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 2020 జనవరి 1 నుంచి 2023 మార్చి 31వరకు మండలంలో దాదాపుగా రూ.10.50 కోట్లతో చేపట్టిన ఈజీఎస్ పనులపై తనిఖీలు చేపట్టడం జరుగుతుందన్నారు. తనిఖీల్లో 14 మంది డీఆర్‌పీలతో పాటు గ్రామానికి ఇద్దరు చొప్పున విలేజ్ రిసోర్స్ పర్సన్లు పాల్గొంటారని తెలియజేశారు.

వివక్ష ఎందుకు?

ఉప్పునుంతల: మండలంలోని ఉప్పునుంతల, ఈరట్వానిపల్లి గ్రామ పంచాయతీలకు ఎమ్మెల్యే ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు చేయకుండా వివక్ష చూపుతున్నారని, ఆయా గ్రామాల సర్పంచ్‌లు కట్టా సరిత, జక్కుల లింగమయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో మొత్తం 27 గ్రామపంచాయతీలుండగా.. 25 గ్రామపంచాయతీలకు సీసీ రోడ్లు, దేవాలయాలు, మసీదుల నిర్మాణాలకు ఇటీవల ఎమ్మెల్యే ఎస్‌డీఎఫ్ నిధులు రూ.7.50 కోట్లు మంజూరు చేయించారని అన్నారు. కేవలం రెండు గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు చేయకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

అంబేడ్కర్ జీవితం అందరికీ ఆదర్శం



కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న హన్మంత్‌రావు

కందనూలు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహనీయుడని, ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ యం.హన్మంత్ రావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రం గ్రంథాలయ సమావేశ హాలులో అంబేడ్కర్ జీవితంపై కవి సమ్మేళనం నిర్వహించారు. ఎదిరెపల్లి కాశన్న అధ్యక్షతన కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ చైర్మన్ హన్మంత్ రావు మాట్లాడారు. సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 14న హైదరాబాద్ భారీ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నారని అన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని అంబేడ్కర్ జీవితంపై కవి సమ్మేళనం నిర్వహిస్తున్నామని అన్నారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంతోనే దేశంలోని అన్నివర్గాల ప్రజలకు హక్కులు, న్యాయ చట్టాలు వచ్చాయన్నారు. ఆయన స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం జరిగిందని అన్నారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం ఆయన ఆశయాలని కొనియాడారు. హాజరైన కవులు, అంబేడ్కర్ పోరాటం త్యాగాలపై కవితాగానం చేశారు. అనంతరం కవులందరికి శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ కళాకారులు డి.రాములు, కందికొండ మోహన్, సుబ్బయ్య, మద్దిలేటి, అరుణ్ కుమార్, భరద్వాజ్ ఎజ్జుమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని మొలచింతలపల్లిలో అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని 14న ఆవిష్కరించనున్నట్లు విగ్రహ దాత దళిత్ బిజినెస్ డ్రాఫర్ పుట్టపాగ శ్రీనివాస్ తెలియజేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని చెప్పారు. ముఖ్య అతిథులుగా మాజీ చీఫ్ సెక్రెటరీ సైలేంద్ర కుమార్ జోషి, అతిథులుగా ప్రజా గాయకుడు గద్దర్, డైరెక్టరేట్ ఇంటర్ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మారెడ్డి, అడిషనల్ డిప్యూటీ కమిషన్ పోలీస్ మురళి పాల్గొంటారని చెప్పారు.

కార్యదర్శుల సేవలు అభినందనీయం



వెల్దండలో వినతి అందజేస్తున్న కార్యదర్శులు

వెల్దండ: గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు అందిస్తున్న సేవలు అభినందనీయమని వెల్దండ ఎంపీపీ విజయ పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ కార్యదర్శులు విధులు చేపట్టి నేటితో నాలుగేళ్లు పూర్తికావడంతో కేక్ కట్ చేసి పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ విజయ మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గ్రామస్థాయిలో ప్రజలకు కార్యదర్శులు బాధ్యతగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో సేవలందిస్తున్న కార్యదర్శులను అభినందించారు.

కార్యదర్శుల వినతి..

జూనియర్ కార్యదర్శులుగా ప్రభుత్వం విధుల్లోకి తీసుకున్నారని, రెండేళ్లు పూర్తి చేసిన వారిని రెగ్యులర్‌గా ప్రకటిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. విధుల్లో చేరి నాలుగేళ్లు గడుస్తున్నా.. నేటికి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాలేదన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. డిమాండ్లతో కూడిన వినతిని ఎంపీపీ విజయ, ఎంపీడీఓ శ్రీనివాసులు అందజేశారు. జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ఎంపీపీ శాంతి, డీఆర్‌డీఓ నర్సింగ్‌రావు, ఎంపీడీఓ శ్రీనివాసులు, సూపరింటెండెంట్ మోహన్‌లాల్, ఎంపీటీసీలు వెంకటయ్యయాదవ్, చక్రవర్తిగౌడ్, మోతిలాల్‌నాయక్, రాములు, ఫయాజ్, సురేందర్‌రెడ్డి ఉన్నారు.

తెలకపల్లి: మండలంలో వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు బుధవారం ఎంపీడీఓ భాస్కర్‌కు వినతి అందజేశారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణ చేయాలని వినతిలో కోరారు.

వీధినాటకాలకు ప్రోత్సాహం



చౌదర్‌పల్లిలో కళాకారులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

వెల్దండ: మండల పరిధిలోని చౌదర్‌పల్లిలో వీధినాటకాలు వేస్తున్న కళాకారులకు ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.30 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చౌదర్‌పల్లిలో ఎల్లమ్మ నాటక ప్రదర్శన చేస్తున్నారు. గ్రామీణ ప్రాంత కళాకారులను ప్రోత్సహించుకోవాలన్నారు. పురాతన కాలం నుంచి వస్తున్న కళలు మరుగునపడుతున్నాయని, కళాకారులను ప్రోత్సహించుకుని సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం కళాకారుల బృందానికి రూ.30 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రమేష్‌నాయక్, కొండల్‌యాదవ్, చంద్రశేఖర్, జగన్ తదితరులు ఉన్నారు.

చలో అచ్చంపేట కరపత్రాల విడుదల

అచ్చంపేట రూరల్: నిఖిత మృతి కేసును హత్యగా నమోదు చేయాలని, సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేపట్టాలని నిఖిత న్యాయ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. 16న నిర్వహించే 'చలో అచ్చంపేట' కరపత్రాలను బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో విడుదల చేశారు. ఈ సందర్భంగా పలువురు జేఏసీ నాయకులు మాట్లాడారు. కేసును తప్పుదోవ పట్టిస్తున్న పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. హత్య చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలన్నారు. చలో అచ్చంపేట కార్యక్రమానికి మందకృష్ణ మాదిగతో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో నిఖిత న్యాయ జేఏసీ నాయకులు మోపతయ్య, శివ, జంగయ్య, సాటకాశీం, విజయ్, వెంకటేష్, గౌరీశంకర్, మల్లేష్, వెంకట్‌రెడ్డి, కాశన్న పాల్గొన్నారు.

గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న ఎంపీపీ ఉమామహేశ్వరి

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో ఎంపీపీ ఉమామహేశ్వరి అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలు గ్రామాల సర్పంచ్‌లను, పంచాయతీ కార్యదర్శులను గ్రామాల సమస్యలపై ఎంపీపీ, ఎంపీడీఓ వివరణ అడిగి తెలుసుకున్నారు. సమావేశానికి వివిధ శాఖల అధికారులు కూడా హాజరై ఆయా శాఖల సమస్యలపై చర్చలు జరిపారు. ముఖ్యంగా గ్రామాల్లో తాగునీరు, లైట్లు, మిషన్‌భగీరథ నీరు సమస్యలు ఉన్నాయని సర్పంచ్‌లు సమావేశంలో ఎంపీపీకి తెలియజేశారు. ఆమె వెంటనే సంబంధిత మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడి మరోసారి తాగునీటి సమస్య రావొద్దని, వెంటనే భగీరథ పైపు లీకేజీల సమస్యలు తీర్చాలని అధికారులకు సూచించారు. సమస్యలపై ఎంపీపీ ఉమామహేశ్వరి కల్పించుకుని వారితో మాట్లాడారు. అధికారులు సహకరించాలని, పని లేని ప్రజలకు ఉపాధి కల్పించాలని సూచించారు. నిత్యం గ్రామాల సమస్యలపై పర్యవేక్షణలో ఉండాలని, మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామాల్లోని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ఎటువంటి సమస్యలైన పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. సభలో సర్పంచ్‌లు సూచించిన పలు సమస్యలకు పరిష్కారం త్వరలోనే చూపిస్తానని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామయ్య, ఏపీఓ కృష్ణమోహన్, సింగిల్ విండో చైర్మన్ విజయరామారావు, ఎంపీఓ భరత్, జిల్లా కోఆప్షన్ మెంబర్ మథీన్, పలు గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మత్స్యకార సంఘం సభ్యులు



ఎమ్మెల్యేను కలిసిన సభ్యులు

తాడూరు: మండలంలోని తుమ్మలసూరుకు చెందిన మత్స్య సహకార సంఘం సభ్యులు మాజీ సర్పంచ్ కృష్ణయ్య ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డిని కలిశారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. గ్రామంలో సహకార సంఘం భవన నిర్మాణం కోసం స్థలాన్ని సేకరించామని, భవన నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని ఎమ్మెల్యేను కోరారు. తమను ఆదుకుంటామని హామీ ఇచ్చినట్లు సంఘం సభ్యులు గోవర్ధన్, రామచంద్రయ్య తదితరులు తెలియజేశారు.

కూలీలందరికీ పని కల్పించాలి

వెల్దండ: వెల్దండ మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందికి బుధవారం డీఆర్‌డీఓ నర్సింగ్‌రావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేసవిలో కూలీలందరికి ఉపాధిహామీ పనులు కల్పించాలన్నారు. జాబ్‌కార్డులను కల్పించి, పనులకు వచ్చేలా చూడాలన్నారు. కొలతల ప్రకారం పనులు చేయించాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఐకేపీ సిబ్బందికి హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణకు మహిళ సంఘాల సభ్యులను తరలించేలా చూడాలన్నారు. మండలానికి ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేస్తున్నట్లు సూచించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏపీఎం రాములు, ఇన్‌చార్జ్ ఏపీఓ ఈశ్వర్, ఉపాధి సిబ్బంది తదితరులు ఉన్నారు.

కేసు నమోదు

బల్మూర్: భూతగాదా విషయంలో తల్లి, అన్నపై దాడి చేసి గాయపర్చిన వ్యక్తిపై బాధితుల ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివానందం గౌడ్ తెలిపారు. మండలంలోని బాణాలకి చెందిన పార్వతమ్మ, శరత్‌పై ఈ నెల 5న శ్రీకాంత్ తాగిన మైకంలో తనకు భూమి పట్టా చేయాలని విచక్షణ రహితంగా దాడి చేయడంతో వారు గాయపడ్డారు. బాధితులు ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని వచ్చి బుధవారం ఫిర్యాదు చేయడంతో అతనిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలియజేశారు.

ఇంటింటికీ పాదయాత్ర వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



నాగర్‌కర్నూల్ రూరల్: బీజేపీ హఠావో, దేశ్ బచావో నినాదంతో సీపీఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా ఇంటింటికి సీపీఐ పాదయాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో పార్టీ జిల్లా కార్యదర్శి బాల్‌నర్సింహ, కార్యవర్గ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాల్‌నర్సింహ మాట్లాడారు. సీపీఐ పాదయాత్ర విజయవంతానికి పేద ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆనంద్, వెంకటయ్య, కేశవులు గౌడ్, కృష్ణాజీ, శివశంకర్, రామస్వామి పాల్గొన్నారు.

కొండనాగేష్ ఆధ్వర్యంలో

తాడూరు: మండల కేంద్రంలో బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జ్ కొండనాగేష్ ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం, అభివృద్ధి కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలను ఇంటింటా ప్రచారం చేయడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. పల్లెపల్లెకు వెళ్లి ఇంటింటా ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలన ప్రజలకు అర్థమయ్యే రీతిలో తెలియజేసుకుందామన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ జెండాను ఎగురవేస్తామన్నారు. అవినీతిమయంలో కూరుకుపోయిన బీఆర్ఎస్‌కు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. బీజేపీ నాయకులు బాలస్వామి, రాములు, రమేష్, లక్ష్మణ్, రాము తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలను పట్టించుకోని అధికారులు

లింగాల: మండలంలోని జీల్గుపల్లితండాలో మంగళవారం ఉపాధి పనులు చేస్తూ.. తెనెటీగల దాడిలో గాయపడిన తమను అధికారులు ఎవరూ పట్టించుకోలేదని బుధవారం కూలీలు ఆందోళన వ్యక్తం చేశారు. పనులు చేస్తున్న సమయంలో తెనెటీగలు దాడి చేయగా.. చికిత్స నిమిత్తం 108 అంబులెన్సులో అచ్చంపేట ఆస్పత్రికి వెళ్లామన్నారు. సంబంధిత ఎంపీడీఓ, ఏపీఓ, పంచాయతీ కార్యదర్శి ఎవరూ కూడా వచ్చి సంఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి పనుల వద్ద మా లాంటి కూలీలకు ఆపద జరిగితే పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



తెలకపల్లి: మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో బుధవారం మండల పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 40 రోజులు పూర్తయిన సందర్భంగా బుధవారం ఆలయంలో అర్చకులు శ్రీకాంత్ శర్మ ఆర్యవైశ్యుల సంఘం సభ్యుల ఆధ్వర్యంలో హోమాలు, కుంకుమార్చన వంటి కార్యక్రమాలు నిర్వహించారు. మండల పూజల్లో భాగంగా ఈ కార్యక్రమాలు నిర్వహించారు. అదే విధంగా అమ్మవారికి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వెండి చీరను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులతో పాటు మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కలాం విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలం పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పన

కందనూలు: పట్టణంలోని పోస్టాఫీస్ వద్ద వక్ఫ్ కాంప్లెక్స్ పక్కన మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని బుధవారం మైనార్టీ నాయకులతో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పన, కమిషనర్ జయంత్‌కుమార్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడారు. ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఆదేశాలతో జిల్లా కేంద్రంలోని వక్ఫ్ కాంప్లెక్స్, పోస్టాఫీస్, పుల్లారెడ్డి హాస్పెటల్ దారిలోని సర్కిల్‌లో విగ్రహ ఏర్పాటుకు అనువుగా ఉండే స్థలాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. త్వరలో స్థలాన్ని ఫైనల్ చేసి విగ్రహ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. స్థల పరిశీలనలో ముస్లిం అడ్వైజర్ కమిటీ అధ్యక్షుడు హబీబ్ ఖాన్, మహ్మద్ సాదిక్ పాషా, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు ముస్తాక్ అహ్మద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ హమీద్ ఖాన్, ఖాజా ఖాన్, ఇసాక్మియా, ఇమ్రాన్ ఖాన్, సల్మాన్ ఖాన్ పాల్గొన్నారు.

ఏవీఎన్ రెడ్డికి సన్మానం



సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) నాగర్‌కర్నూల్ జిల్లా ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ శాసన మండలి సభ్యులుగా విజయం సాధించిన ఏవీఎన్ రెడ్డిని మంగళవారం రాత్రి శాలువాలతో, పూలమాలలతో సన్మానించారు. స్థానిక లహరీ గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లాలోని నలుమూలల నుంచి ఉపాధ్యాయులు హాజరుకాగా.. తపస్ జిల్లా అధ్యక్షుడు దెంది రాజారెడ్డి, జిల్లా కార్యదర్శి మనమోని శేఖర్ సంఘ భావజాలాన్ని, నిజాయితీని కొనియాడారు. సన్మాన గ్రహీత ఏవీఎన్ రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వం విద్యారంగంపై తీవ్ర వివక్ష చూపుతుందని ఉపాధ్యాయ, అధ్యాపక వర్గం సమస్యలతో కొట్టుమిట్టాడుతుందన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, రాష్ట్ర బాధ్యులు సురేఖ, మల్లికార్జున్, పెంటయ్య, పెంట్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఇంటింటి ప్రచారం



పాతరాయవరంలో మాట్లాడుతున్న వంశీకృష్ణ

లింగాల: రాష్ట్రంలో పేదల బతుకులు బాగు చేసేది కాంగ్రెస్ పార్టీ ఒక్కటేనని మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్రలో భాగంగా బుధవారం మండల పరిధిలోని కొత్తచెర్వుతండా, నల్లకుంట, పాతరాయవరం గ్రామాల్లో డీసీసీ అధ్యక్షుడితో పాటు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ పార్టీ అమలు చేసే పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ మాట్లాడారు. జోడో యాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని, మండలంలోని అన్ని గ్రామాల్లో దశల వారీగా జోడో యాత్రను నిర్వహించి, ప్రజలకు మరింత చేరువయ్యేందుకు కృషి చేస్తున్నామని తెలియజేశారు. కాంగ్రెస్ మండల నాయకులు పాల్గొన్నారు.

'ఆత్మీయ సమ్మేళనాల్లో అబద్ధాలు'

కల్వకుర్తి: రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమాన్ని విస్మరించి ఎన్నికల హామీలను బీఆర్ఎస్ తుంగలో తొక్కిందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి ఆరోపించారు. బుధవారం మండలంలోని మార్చాలలో విలేకరులతో మాట్లాడారు. భారతీయ రాష్ట్ర సమితి నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనాల్లో అబద్ధాలను చెబుతున్నారని, ఒక్కసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలని సూచించారు. సమావేశంలో శ్రీకాంత్ రెడ్డి, అనిల్‌గౌడ్, గోపాల్, సైదులు యాదవ్, శ్రీధర్ రెడ్డి, అంజి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ముఖ్యకార్యకర్తల సమావేశం

పెంట్లవెల్లి: మండల పరిధిలోని జటప్రోల్‌లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్ ఆధ్వర్యంలో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహయాదవ్ మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో కొల్లాపూర్‌లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని, ఇకపై బీఆర్ఎస్‌ని ప్రజలు నమ్మబోరని అన్నారు. కాంగ్రెస్ జెండాపై గెలిచి, అధికార పార్టీలోకి వెళ్లిన ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఇప్పటివరకు మన ప్రాంతానికి చేసిందేమి లేదన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగినేని అభిలాష్‌రావు ఆదేశాల మేరకు త్వరలోనే నూతన మండల కమిటీ, గ్రామాల్లో కమిటీలను నిర్వహించి పార్టీ బలోపేతానికి కృషి చేద్దామని మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్ సమావేశంలో కార్యకర్తలతో ముచ్చటించారు.

బస్టాండ్‌లో ఫ్రిజ్ వాటర్ ఏర్పాటు



కందనూలు: టీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు ప్రయాణికుల సౌకర్యార్థం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో డిపో మేనేజర్ ధరమ్ సింగ్, మున్సిపల్ వైస్ చైర్మన్ బాబురావులు బుధవారం నూతన ఫ్రిజ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడారు. వేసవి తీవ్రత దృష్ట్యా ప్రయాణికుల సౌకర్యార్థం నూతన ఫ్రిజ్ ద్వారా చల్లని నీరు ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్వామి, నారాయణ, పాషా పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

తాడూరు: తెలంగాణ ప్రభుత్వం అంధత్వ నివారణ కోసం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ శ్రీదేవి అన్నారు. బుధవారం సర్పంచ్ అశోక్‌తో కలిసి కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతిఒక్కరూ కంటి శిబిరానికి వచ్చి పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డా.ఇస్మాయిల్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జితో విచారణ జరపాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: ఇటీవల టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీపై హైకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీక్‌లో హైకోర్టు జడ్జితో విచారణ చేయడంతో పాటు బోర్డును ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పించాలని, పదో తరగతి పేపర్ లీక్‌లో ఏ1గా ఉన్న బండి సంజయ్‌పై న్యాయ విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఉపాధ్యక్షుడు నరేశ్, ప్రకాశ్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

పనులు త్వరితగతిన పూర్తిచేయాలి

తెలకపల్లి: 'మన ఊరు– మన బడి' అభివృద్ధి పనులను నాణ్యతగా త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఈఓ చంద్రుడు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో తెలకపల్లి, లింగాల మండలాలకు సంబంధించిన ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ చంద్రుడు మాట్లాడారు. వచ్చే విద్యాసంవత్సరం 2023–24కు సంబంధించి విద్యార్థులకు అందించే యూనిఫాంలకు సంబంధించి పాఠశాలల యాజమాన్య కమిటీల తీర్మానం చేసి వెంటనే దర్జీలకు అందజేయాలని సూచించారు. ఎంత త్వరగా దర్జీలకు ఇస్తారో అంతే త్వరగా యూనిఫాం విద్యార్థులకు అందుతాయన్నారు. ఎంఈఓ చంద్రుడు, శ్రీనివాస్‌రెడ్డి, బాలస్వామి పాల్గొన్నారు.